"రొట్టె అయివాదే అకలయితుండది" చెప్పులను బయట వదలి గుడిసె లోపలికి వస్తూ అన్నాడు ముత్యాలు.

"ఏందయ్యో నా దగ్గరేమన్నా మాయ మంత్రాలున్నాయా నిముషంల వంట చేయనీకె. కూలికొయ్యి ఇప్పుడొచ్చి పొయ్యి రాజేస్తుండ చూడు" పొయ్యి ఊదుతూ బదులిచ్చింది నాగమ్మ.

"పోనీ పొద్దుగాలది బువ్వేమైన మిగిలిందా" గోడకు చేరగిల బడి కూర్చొని చుట్ట ముట్టించుకుంటూ అన్నాడు.

# ఎ లోన్ స్టోరీ

గంగుల నరసింహారెడ్డి



"పిల్లలున్న మనలాంటోళ్ళ ఇంట్ల సద్దన్నం మిగుల్తదా. మన పెద్ద పోరగాడు అప్పుడే తిన్నడంట."

"హూఁ" బరువుగా మూలిగాడు.

"ఏంది గట్ల మూలుగుతున్నవు. గింత ఆకలికి ఓర్చలేకపోతే ఎట్ల. పొయ్యి అంటుకుంటె జరసేపట్ల రొట్టె చేస్త చూడు" అంటూ పొయ్యిపై పెంకుని పెట్టి పిండిని తడపసాగింది నాగమ్మ.

ఆ ఊరిలో ముత్యాలు ఓ సన్నకారు రైతు. మూడెకరాల మెట్టపొలం ఉందతనికి. వానాకాలంలో ఆ కాస్త పొలంలో జొన్నలు, వేరుశనగ వేస్తాడు. వానలు అనుకూలంగా పడితే సంవత్సరం మొత్తానికి తిండి జరుగుబాటుకేం బాధుండదు. మిగతా కాలమంతా భార్యాభర్తలు కూలీ చేసుకొని హాయిగా బ్రతుకుతూ కొంత డబ్బును వెనకేసుకున్నారు. ఉన్న రెండు ఎడ్లను పెద్దకొడుకు మేపుకొస్తాడు.

"ముత్యాలూ ఓరి ముత్యాలూ" వాకిట్లోంచి ఎవరో పిలిచారు.

"ఎవరయా" అంటూ లేచాడు ముత్యాలు.

"నిన్ను పట్వారి తోలుకరమ్మన్నడ్రా" అన్నాడు వచ్చిన కావలి భీముడు.

"ఎందుకూ?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఏమోరా నాకేం తెలుసు."

"ఇప్పుడే వస్తనే" అన్నాడు భార్య నుద్దేశించి.

"రొట్టె అయింది తినిపోరాదూ" అంది నాగమ్మ.

"జల్ది వాస్త ఏం పనో ఏమో?"

అలా వెళ్ళిన ముత్యాలు ఓ గంట సేపటికి గాని తిరిగి రాలేదు. ఈలోగా నాగమ్మ రొట్టెలు చేసి పిల్లలతో తినిపించింది.




"ఆకలయితుందని చెప్పి అక్కన్నే పోతివి" భర్త చేతికి నీళ్ళచెంబు అందిస్తూ అడిగింది నాగమ్మ.

"పెద్దోళ్ళ తానికి పోయినప్పుడు మనం అనుకున్నప్పుడే లేచి రావటానికి కుదర్తదా. పటా్వరి మంచి వార్త చెప్పిండు." అతని గొంతులో స్పష్టమైన ఆనందం ధ్వనించింది. "మనకు బ్యాంకోళ్ళు లోనిస్తరంట."

"అంటే...." ఆమెకు అర్థం కాలేదు.

"మనకు సర్కారోళ్ళు రూపాయలిస్తరంట బాయి తొవ్వుకోనీకె."

"మనకు బాయా!" కళ్ళు పెద్దగా చేసుకొని ఆశ్చర్యంగా చూసింది.

"అవునే మనకు పది వేల రూపాయలిస్తరంట. అందుల రెండు వేల అయిదొందలు మాఫీ అయితవంట. మిగిలింది కిస్తుల కింద కట్టాలంట."

అమితానందంతో నాగమ్మకు గొంతు పెగల్లేదు.

"ఏందే బాయనేసరికి అప్పుడే ఎర్రెత్తి పోయినవు. ఇంకో రొట్టెయ్యి" అన్నాడు ముత్యాలు.

ఆ రాత్రి వారి కలల నిండా బాయి. వరి చేనే కనిపించాయి.

* * *

మరునాటి నుంచి ముత్యాలు కూలికి వెళ్ళడం మానుకొని పట్వారి వెంబడి తిరుగుతూ అతని ఖర్చులన్నీ భరించాడు. మార్టిగేజ్‌కు. తదితర ఖర్చులకు ఇన్నాళ్ళూ కష్టపడి సంపాదించిన డబ్బు ఖర్చయ్యాక అతనికి లోన్ శాంక్షను అయింది.

పదివేల రూపాయలు మొత్తం బ్యాంకు వాళ్ళే ఇవ్వరు. అందులో ఇరవై అయిదు శాతం అంటే రెండువేల అయిదు వందలు ప్రభుత్వం సబ్సిడీగా ఇస్తుంది. మొదటి దఫాగా బ్యాంకువాళ్ళు పన్నెండు వందల యాభై రూపాయలిచ్చారు.

ఏ చోట నీళ్ళు బాగా పడతాయి, ఎప్పుడు ఎవరితో మొదలుపెట్టాలి అనే వివరాలు పంతులుగారితో సంప్రదించి ఓ శుభ ముహూర్తాన తన పెద్ద కొడుకుతో ప్రారంభం చేయించాడు. పేదవాడినని బతిమాలి ఒక ఘనపుకోలకు [కోల అనగా నాలుగున్నర అడుగులు] ఇరవై అయిదు రూపాయలకు కుదుర్చుకున్నాడు కూలీలను.

తరువాత బ్యాంకు ఫీల్డు ఆఫీసరు వచ్చి చూసి వెళ్ళి రెండవ దఫాగా మరో 12 వందల యాభై రూపాయలిప్పించాడు. ఈ మొత్తం రెండు వేల అయిదొందలకు అయిదు కోల్ల పొడవు. నాలుగు కోల్ల వెడల్పు. అయిదు కోల్ల లోతుగల బావి తయారయింది.

డబ్బుకోసం మళ్ళ బ్యాంకుకు వెళ్తే మార్జిన్‌మనీ యింకా రాలేదనీ. తామివ్వాల్సిన మిగతా అయిదువేలకు ఓ ఆయిల్ ఇంజను ఇచ్చారు.

పదికోల్లు త్రవ్వినా సరిగ్గా నీళ్ళు అందివ్వని బావులున్న ఈ కాలంలో అయిదు కోల్ల ఆ చిన్న బావి వానకాలంలో అర ఎకరం వరి పంటకు నీళ్ళు అందిస్తే ఎండా కాలంలో అయితే వేరుశనగే వేయాలి.

వరినాటాలంటే నాటుకు,కలుపుకూళ్ళకు. ఎరువు సంచులకు. డీజిల్ ఆయిల్ కు అయిదు వందల రూపాయలైనా కావాలి-తన దగ్గర ఒక్క పైస కూడాలేదు. అందుకే ఊళ్ళోని సావుకారి దగ్గర అప్పు చేశాడు. కొత్తగా తరికట్టిన పొలం కాబట్టి పెట్టుబడి డబ్బు కూడా రాలేదు.రెండో పంటకు మళ్ళ అప్పే.

ఇప్పుడు ముత్యాలులో మునుపటి ఉత్సాహం, నిశ్చింత కనిపించకుండా పోయాయి. ఓ వైపు అప్పు, మరోవైపు కట్టాల్సిన లోన్ వాయిదా డబ్బు. ఆ చాలీ చాలని బావిని చూస్తూనే కోపం వస్తుందతనికి.

రెండేండ్ల తరువాత మార్జిన్ డబ్బు వచ్చిందంటే బ్యాంకుకు వెళ్ళాడు.ఆ డబ్బు కాస్తా రెండేండ్ల వాయిదాలకు సరిపెట్టుకున్నామని ఖాళీ చేయి చూయించారు.

పొలంలో పండిన పంట షావుకారి అప్పు తీర్చడానికి,తన కుటుంబం బతకడానికే సరిపోతుంది. బ్యాంకు నుంచి ఎన్ని నోటీసులొస్తున్నా అతనేం చేయగలడు ? అర ఎకరం పొలంతో తను బతుకుతూ సంవత్సరానికి పన్నెండు వందల యాభై రూపాయలు ఎలా చెల్లించగలడు?

ఫీల్డు ఆఫీసరు వచ్చి పట్వారి ఇంట్లో కూర్చొని తనను పిలిపించి లోన్ డబ్బు కక్కాలని కసిరి అడిగినప్పుడు-

"అయ్యా నాకిస్తానన్న పదివేల రూపాయలు మొదటే ఇచ్చినుంటే. మీరిక్కడికి రావల్సినంత అవసరం లేకుండా నేనేవచ్చి డబ్బు సరిగ్గా కట్టేవాన్ని. కాని ఇట్ల సగం సగం సాయంచేసి నన్ను ఖరాబు చేసిండ్రు. చెప్పరాని ఫికరు పెట్టిండ్రు-కాని మళ్ళ మాలాంటోళ్ళకెవరికి కూడ లోన్లిచ్చి ఇట్ల మంచిగ బతికెటోల్లను చెడగొట్టకుండ్రయ్యా" అని అతనితో అందామనుకొని "నా పొలం, ఇంజన్ను నీవే కొనుక్కొని మొత్తం లోన్ కట్టయ్యా" అన్నాడు పట్వారితో.

"సరే" అని ఒప్పుకున్నాడు పట్వారి సంతోషంగా.

దాంతో ఓ లోన్‌వల్ల భూస్వామి పట్వారికి నాలుగెకరాల పొలం ఎక్కువయితే. సన్నకారు రైతు ముత్యాలు ఆ కాస్తా పొలం పోగొట్టుకొని వ్యవసాయ కూలీ అయ్యాడు.

ఇప్పుడు ముత్యాలు చాలా నిశ్చింతగా వున్నాడు: